క్లుప్తంగా

పరామర్శ



శ్రీనివాస్‌ను ఓదార్చుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ అంబేడ్కర్ సర్కిల్ అధ్యక్షుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ కుమారుడు సిద్దార్థ్ ముతంగి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, మాజీ కౌన్సిలర్లు జహంగీర్, మోతీరాం, బీఆర్ఎస్ నాయకులు ఇజ్రాయిల్ బాబీ, భూమయ్య, శివప్ప తదితరులు శ్రీనివాస్‌ను పరామర్శించారు. సిద్దార్థ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ భార్య ప్రమీల, పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు, అంబేడ్కర్ సర్కిల్ నాయకులు శ్రీనివాస్‌ను పరామర్శించారు.

కర్ణాటక డిప్యూటీ సీఎంకు సన్మానం



డీకే శివకుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: కర్ణాటక రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక మంత్రి బోసురాజు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగుళూరు నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి శనివారం రావడంతో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌లు హైదరాబాద్ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఓటు వినియోగంపై అవగాహన



పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారి

న్యాల్‌కల్(జహీరాబాద్): వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటును ఏవిధంగా వినియోగించుకోవాలనే అంశంపై ఎంపీపీ కార్యాలయంలో బూత్ లేవల్ ఆఫీసర్స్, పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ రాజిరెడ్డి ఓటు వినియోగంపై పలు సూచనలు చేశారు. సమావేశంలో బూత్ లేవల్ ఆఫీసర్స్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: జీవితంపై విరక్తిచెంది యువకుడు లాడ్జిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకొంది. జహీరాబాద్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్ మండలంలోని కాకిజనవాడ గ్రామానికి చెందిన పుట్టి మాణిక్‌కు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు మల్లేశ్ ఆరేళ్ల క్రితం గ్రామం వదిలి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. దసరా పండగ సందర్భంగా మల్లేశ్ హైదరాబాద్ నుంచి జహీరాబాద్‌కు వచ్చినా ఇంటికి వెళ్లకుండా ఓ లాడ్జిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో లాడ్జీలో శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్టును ఢీకొన్న బస్సు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని సింగూరు వద్ద శుక్రవారం రాత్రి ఎంఆర్ఎఫ్ పరిశ్రమ కార్మికులను తరలించే బస్సు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో పుల్‌కల్ మండలానికి చెందిన కార్మికులను శుక్రవారం రెండో షిఫ్టుకు తీసుకెళ్తున్న క్రమంలో సింగూరు వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

జహీరాబాద్ టౌన్: ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు శనివారం బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం జహీరాబాద్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్న మూడు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. దాడుల్లో 23 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణ సెక్టార్ అధికారులదే

- శిక్షణకు తప్పనిసరి హాజరవ్వాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా



మాట్లాడుతున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం సెక్టార్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్‌స్టేషన్లకు వెళ్లాల్సిన ఈవీఎంలను ఏవిధంగా సీలింగ్ చేయడం, భద్రపరచడంపై జిల్లా మాస్టర్ ట్రైనర్ కృష్ణకుమార్ సెక్టర్ అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్కో సెక్టర్ అధికారి తమకు అప్పగించిన వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఒక్కొక్క సెక్టర్ అధికారి పరిధిలో 8 నుంచి 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. 38 రూట్‌లకు సెక్టర్ అధికారులు ఉన్నారని తెలిపారు.

శిక్షణ తరగతులు..

పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు హత్నూర మండల పరిధిలోని పోలింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదిన 480 మందికి, 31న మరో 480 మందికి పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని, తప్పనిసరిగా పీఓలు, ఏపీవోలు శిక్షణకు హాజరుకావాలని సూచించారు. లేనిపక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్ పాల్గొన్నారు.

బసవేశ్వరుడి సేవలు మరువలేనివి

కర్ణాటక మంత్రి ఈశ్వర్‌ఖంద్రె
వైభవంగా శరణుమేళా ప్రారంభం



శరణుమేళాను ప్రారంభిస్తున్న మంత్రి ఈశ్వర్‌ఖంద్రె, గంగమాతాజీ, నాయకులు

జహీరాబాద్ టౌన్: అణగారిన జాతులకు బసవేశ్వరుడు అందించిన సేవలు మరువలేనివని కర్నాటక మంత్రి ఈశ్వర్‌ఖంద్రె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సరిహద్దున ఉన్న కర్నాటక బసవకల్యాణ్‌లో 22వ కల్యాణపరవ శరణు మేళాను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ఖంద్రే మాట్లాడుతూ మహాత్మ విశ్వగురువు బసవేశ్వరుడు బసవకళ్యాణ్‌ను పరిపాలించి నవసమాజ నిర్మాణం కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఇప్పటి పార్లమెంట్ తరహాలో 12వ శతాబ్దంలో అనుభవ మండపాన్ని ఏర్పాటు చేసి అణగారిన జాతుల ప్రజలకు ఉన్నత పదవులను కట్టబెట్టారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రతిష్ఠించిన 108 అడుగుల భారీ బసవేశ్వరుడి విగ్రహం వద్దకు నిత్యం పర్యటకులు వస్తుంటారన్నారు. రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది బసవకళ్యాణ్‌లో శరణుమేళాకు తెలంగాణ రాష్ట్రంలోని జహీరాబాద్ ప్రాంత భక్తులు అధికసంఖ్యలో తరలి వస్తుండటం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, జగద్గురు గంగమాతాజీ, బాల్కీ పీఠాధిపతి పట్టదేవరు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో విత్తన ఎంపిక కీలకం



క్షేత్ర సందర్శనలో పాల్గొన్న రైతులు

రాయికోడ్(అందోల్): పత్తిపంట సాగు చేసే రైతులు విత్తన ఎంపిక చేసుకోవడం కీలకమని నూజివీడు సీడ్స్ ఏరియా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాయిపల్లి గ్రామంలో ఆద్య 1134 రకం పత్తి విత్తనాలతో రైతు తుకరాం సాగుచేస్తున్న పత్తి పొలాన్ని పరిశీలించారు. వివిధ గ్రామాల రైతులు విచ్చేసి తుకారం పండిస్తున్న పత్తిని చూసి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆద్య రకం పత్తి విత్తనంతో కాత, పూత మెరుగ్గా ఉండి పంట త్వరగా చేతికందుతుందని ఏరియా మేనేజర్ రైతులకు వివరించారు. రెండవ పంట సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ప్రవీణ్‌రెడ్డి రైతులకు సూచించారు. తుకారాం సాగు చేస్తున్న పత్తి ఎకరాకు 12 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు నవీన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నియామకం



ఇక్బాల్ హుస్సెన్

సదాశివపేట (సంగారెడ్డి): బీఆర్ఎస్ సదాశివపేట పట్టణ ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని పాతకేరీకి చెందిన ఇక్బాల్ హుస్సెన్‌ను శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్ నియమించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ హుస్సెన్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

మెరుగైన సేవలు అందిస్తాం

నారాయణఖేడ్: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వటపల్లి, సదాశివపేటలకు నడిచే బస్సులను పుల్‌కల్ మీదుగా నడపాలని లక్ష్మణ్ అనే వ్యక్తి కోరాడు. అదేవిధంగా పిట్లం మీదుగా మహారాష్ట్రలోని డెగ్‌లూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని ఖేడ్‌కు చెందిన నరేందర్ కోరగా కంకోల్‌కు బస్సును సమయానుసారం నడపాలని పలువురు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డీఎం మల్లేశయ్య తెలిపారు.

క్రికెట్ టోర్నీలో పట్లూరు తండా జట్టు విజయం



గెలుపొందిన జట్టుకు నగదు, షీల్డ్‌ను ప్రదానం చేస్తున్న నాయకుడు ప్రతాప్‌రెడ్డి

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో వికారాబాద్ జిల్లా పట్లూర్ తండా జట్టు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు ముఖ్య అతిథిగా యువ నాయకుడు ప్రతాప్‌రెడ్డి హాజరై రూ.25 వేల నగదు, షీల్డ్‌ను ప్రదానం చేశారు. రన్నర్‌గా నిలిచిన పట్లూరు జట్టుకు రూ.15వేల నగదుతో షీల్డ్‌ను అందచేశారు. టోర్నీలో 45 టీంలు పాల్గొనగా 13 రోజుల పాటు క్రికెట్ టోర్నీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మైనార్టీలకు సముచిత స్థానం



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న మైనార్టీలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వం మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన జమీత్ ఉల్ అన్సారీల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మైనార్టీల సంక్షేమానికి ప్రణాళికబద్ధంగా నిధులు కేటాయిస్తూ విద్యా, ఉపాధి రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తోందన్నారు. అనంతరం పులువురు అన్సారీలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి మద్దతుగా మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నామని జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్ తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశంగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ లక్ష్మి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కోఆర్డినేటర్ నరేందర్

నారాయణఖేడ్: నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా కోఆర్డినేటర్ నరేందర్, జిల్లా అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని ఫంక్షన్‌హాల్‌లో శనివారం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రహ్మణులకు అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పూర్తిస్థాయిలో అమలుచేయడంలేదన్నారు. ఆర్థికంగా వెనకబడిన నాయీబ్రాహ్మణులకు బీసీబంధు పథకం వర్తింపజేయాలన్నారు. అదేవిధంగా జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కమ్యూనిటీ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. నాయీబ్రాహ్మణులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా, స్థానిక బాధ్యులు సత్యనారాయణ, అంజయ్య, అశోక్, నారాయణ, సాయిలు, గోపాల్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయండి

ఎంఆర్ఎఫ్ కార్మికులకు అండగా ఉంటాం
తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థి వెంకట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దొడ్ల వెంకట్

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్ఎఫ్ పరిశ్రమలో కార్మిక యూనియన్ ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు అవుతున్నా పరిశ్రమ యాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందం అమలు చేయకపోవడం బాధాకరమని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొడ్ల వెంకట్ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు మాటమీద కార్మికులందరూ అభ్యర్థిని గెలిపిస్తే అగ్రిమెంట్ అమలుచేస్తామని హామీనిచ్చి మర్చిపోయారని మండిపడ్డారు. అగ్రిమెంట్ అమలులో భాగంగా 40సార్లు కార్మిక సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోవడం విచారకరమన్నారు. వెంటనే పరిశ్రమ యాజమాన్యం కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కొత్త బస్వరాజ్ పాటిల్, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కట్కం వీరేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

రాయికోడ్(అందోల్): ప్రభాకర్‌రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరనిలోటు అని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని సంగాపూర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. శనివారం నిర్వహించిన అంత్యక్రియలకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాహుల్‌కిరణ్ జైపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు బస్వరాజ్‌పాటిల్ తదితరులు హాజరై నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అంత్యక్రియలకు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బేగరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా మ్యాథరి ప్రకాష్, జాయింట్ సెక్రటరీగా సజ్జపురం పవన్‌కుమార్, జనరల్ సెక్రటరీగా బేగరి అనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కాలనీలో దళితులు, బహుజనులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అంబేడ్కర్ యువజన సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఖేడ్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ప్రచారం

నారాయణఖేడ్: బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ ఖేడ్ మున్సిపాలిటీలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, కో–ఆప్షన్ సభ్యులు లయక్, అంబదాస్, పట్టణ అధ్యక్షులు నగేష్, మాజీ ఎంపీటీసీ మూఢ రామకృష్ణలు కార్యకర్తలతో కలిసి రామమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. 7వ వార్డు నుంచి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు.

సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

నారాయణఖేడ్: ఈ నెల 30న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం మున్సిపల్ చైర్మన్ రుబీనానజీబ్, వైస్‌చైర్మన్ పరశురాం, కో–ఆప్షన్ సభ్యులు లయక్, అంబదాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నగేష్, ఎంపీటీసీ అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

కాంగ్రెస్ అభ్యర్థి దామోదర



నాయకులతో మాట్లాడుతున్న దామోదర రాజనరసింహ

సంగారెడ్డి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆ పార్టీ అందోల్ నియోజకవర్గం అభ్యర్థి దామోదర రాజనర్సింహ అన్నారు. చౌటకుర్ మండలంలోని చక్రియాల్ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని సూచించారు. అనంతరం బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. చౌట్కూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్, ఉపాధ్యక్షుడు రామగౌడ్, ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, జాయింట్ సెక్రెటరీ బాలరాజుగౌడ్, మండల నాయకులు అబెద్ సుభాష్‌రెడ్డి, సర్పంచుల రాష్ట్ర ఐక్యవేదిక అధ్యక్షుడు కృష్ణ, సీనియర్ మండల నాయకులు మల్లారెడ్డి, దుర్గారెడ్డి, రామచంద్రారెడ్డి, చక్రియాల గ్రామ అధ్యక్షులు రాజశేఖర్, యూత్ అధ్యక్షులు బాలరాజు, గ్రామ నాయకులు రోలపాటి పండుగ, మాజీ ఎంపీటీసీ పండరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

జిల్లావ్యాప్తంగా వాల్మీకి మహర్షి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు హరిభజనలు, ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల వాల్మీకి విగ్రహాలను ఆవిష్కరించి బైక్ ర్యాలీలు చేపట్టారు.

– సంగారెడ్డి న్యూస్‌డెస్క్



నారాయణఖేడ్: హరిభజన నిర్వహిస్తున్న భజనకారులు



న్యాల్‌కల్: ఖలీల్‌పూర్‌లో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



రాయికోడ్: ఇటికేపల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న భక్తులు

కాంగ్రెస్‌లో చేరిక

సంగారెడ్డి: బీఆర్ఎస్ సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఐక్యవేదిక మాజీ అధ్యక్షుడు ఆందోల్ కృష్ణ అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహా సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట చౌట్కూర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దశరథ్, యూత్ అధ్యక్షుడు బాలరాజు, నాయకులు మల్లారెడ్డి, పండరి, తుంగె పాండర్, భాస్కర్‌రెడ్డి, ప్రభుశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవాని మందిరంలో పూజలు

సదాశివపేట(సంగారెడ్డి):దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని హట్కర్‌పేట భవాని మందిరంలో భవసార్ క్షత్రియ సమాజ్ అధ్వర్యంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయినాథ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, కౌన్సిలర్ కోవూరి లక్ష్మిప్రసన్న శంకర్‌గౌడ్, భవాని భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్షులు చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

